క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి ఫ్యాన్ల వితరణ



ఆశ్రమానికి ఫ్యాన్లు అందజేస్తున్న ప్రతినిధులు

తుని/తుని రూరల్: కవలపాడు శివారు పెంట కోట రోడ్డులో గల సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమానికి అలయన్స్ క్లబ్ నాలుగు ఫ్యాన్లు వితరణ చేసింది. మంగళవారం క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వీఎస్ఆర్.ఆంజనేయ ప్రసాద్, కోశాధికారి నూకయ్యశెట్టి ఆశ్రమ నిర్వాహకులకు ఫ్యాన్లు అందజేశారు. వృద్ధులకు పండ్లు, ఫలహారం, పాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కుసుమంచి సత్యనారాయణ, డి.వెంకటేశ్వరరావు, కంకిపాటి రామం, నెల్లిపూడి రాజబాబు, బత్తుల నాగేశ్వరరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం



ప్రజలకు సూచనలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: అంటు వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ ఎం సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 18, 20 వార్డుల్లో మంగళవారం కమిషనర్ గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి సత్యదీక్ష మాలధారణ



ఆలయంలో దీక్షా సామగ్రి అందజేస్తున్న కృష్ణబాబు

ఏలేశ్వరం: సత్యదీక్షతో సత్యనారాయణ స్వామి అనుగ్రహం పొందవచ్చని సత్యదీక్షల ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు అన్నారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం సత్యదీక్ష చేపట్టనున్న మాలధారులకు మంగళవారం దీక్షావస్త్రాలు, స్వామి మాల, ఫోటో, పూజా పుస్తకం ఉచితంగా అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 27 రోజుల పాటు సత్యదీక్ష కొనసాగుతుందన్నారు. స్వామివారి అనుగ్రహం పొందాలంటే మాలధారణ చేయాలన్నారు. అన్నవరంలో జరిగే గిరి ప్రదక్షణ, తెప్పోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అర్చకుడు పొన్నూరు సత్యనారాయణాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంపై జనవాణిలో ఫిర్యాదు



జనవాణిలో వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌మిశ్రా పార్టీ నాయకులు

ఏలేశ్వరం: ఏలేశ్వరం నుంచి రమణయ్యపేట మీదుగా ఏజెన్సీకి వెళ్లే ప్రధాన రహదారిని నిర్మించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ మంగళవారం జనవాణిలో ఫిర్యాదు చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జనవాణి ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎమ్మెల్యే పంతం నానాజీకి వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కాశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ.. ఏజెన్సీ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారి నిర్మాణం చేపట్టకపోతే గోడ కడతామని కరపత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట దాడిశెట్టి వీరబాబు, రెడ్డి ఆనంద్‌పాల్ తదితరులు ఉన్నారు.

టైరు పేలి మినీవ్యాన్ బోల్తా

జగ్గంపేట: టైరు పేలడంతో మినీ వ్యాన్ బోల్తా పడిన ఘటన మంగళవారం జగ్గంపేటలో జరిగింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. రావులపాలెం నుంచి అరటి గెలల లోడుతో ఒడిశాలోకి పూరికి మినీ వ్యాన్ బయలుదేరింది. జగ్గంపేట బ్రిడ్జిపై విక్టరీ బజారు ఎదురుగా వచ్చేసరికి ఎడమ వైపు వెనుక టైరు పేలిపోయింది. దీంతో వ్యాన్ ఒక్కసారిగా బోల్తా పడింది. అదృష్టవశాత్తూ వ్యాన్‌లోని డ్రైవర్ రెడ్డి రాజు, క్లీనర్ సుధారపు సూర్య సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం బోల్తా పడిన వ్యాన్‌ను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కొనలేం..తినలేం..!

- పెరిగిన కూరగాయల ధరలు
- వరదలకు తగ్గిన దిగుబడి
- రవాణా ఖర్చు పెరగడంతో భారం
- పచ్చడి మెతుకులకే జనం పరిమితం



తుని రైతు బజారులో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

తుని: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు స్థానికంగా కూరగాయల దిగుబడులు తగ్గాయి. దీనికి తోడు కేంద్రం పన్నుల భారం మోపడంతో ప్రజలపై నిత్యావసర సరుకుల భారం పడింది. వంట నూనె, పప్పు దినుసుల ధరలు ఆందోళనకు గురి చేస్తుంటే తాజాగా కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. శాకాహారం కంటే మాంసాహారం మిన్నగా ఉందని నాన్ వెజ్ ప్రియులు అంటుంటే శాకాహారులు మాత్రం ధరలు ఎంత పెరిగిన కొనడం మాత్రం తప్పదంటూ సరిపెట్టు కుంటున్నారు. గడిచిన నెల వ్యవధిలో కూరగాయల ధరలు 45 శాతం మేర పెరగాయి. దీంతో మధ్య తరగతి, కార్మికుల నెలవారీ బడ్జెట్‌లో 20 శాతం వీటికి వెచ్చిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ధరలపై నియంత్రణ తీసుకురాక పోతే సామాన్యులు కూరకు సైతం నోచుకోని పరిస్థితులు ఉత్పన్నమవుతాయని పలువురు విమర్శిస్తున్నారు. చిన్న, మధ్య తరహా, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల జీతాలు పెరగక పోయినా నిత్యావసర సరుకులు ఆకాశానికి చేరువ కావడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

తగ్గిన సాగు..

మెట్టలో కూరగాయల పంటల సాగు తగ్గడంతో దిగుమతులు పెరిగాయి. దీంతో మార్కెట్‌లో నెల వ్యవధిలో కూరగాయల ధరలు 45 శాతం పెరిగాయి. ఎక్కువ మంది కూరగాయలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక ఉద్యోగులు, సామాన్యుల నెలవారీ బడ్జెట్ పెరిగింది. రైతు బజారులో ఉల్లి, టమాటా, బీర, బెండ, కాకర, దొండ, మునగ, చేమ, ఆగాకర, వంకాయలు, చిక్కుళ్లు, క్యారెట్, క్యాప్సికం, అల్లం, వెల్లుల్లి తదితర కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి.

పంటకు విరామం..

తుని, కోటనందూరు, రౌతులపూడి మండలాల పరిధిలోని గ్రామాల్లో వర్షాలకు కూరగాయల దిగుబడులు తగ్గాయి. పంట పండిన సమయంలో గిట్టుబాటు ధర లభించడం లేదు. మార్కెట్‌లో ధర ఉన్నప్పుడు దిగుబడులు రావడం లేదు. రైతులు తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో ధరలు పెరగడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు అంటున్నారు. వర్షాలకు పలు రకాల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి కావడం లేదని రైతులు చెబుతున్నారు. ఏజెన్సీ నుంచి ఆశించిన స్థాయిలో కూరగాయలు రావడం లేదు. ఏది కోనాలన్నా ధర చూస్తే గుండె గుబేలు మంటుందని జనం వాపోతున్నారు.

మార్కెటింగ్ శాఖ దృష్టి సారించాలి

మార్కెట్‌లో కూరల ధరలు చూస్తే గుండె గుబేలు మంటుంది. గతంలో రూ.200లు పెడితే అన్ని రకాల కూరలు వచ్చేవి. ఇప్పుడు అవే కూరగాయలకు రూ.500లు ఖర్చవుతోంది. ఓ వారం ఉన్న రేటు మరుసటి వారం ఉండడం లేదు. మార్కెటింగ్ శాఖ ధరలను నియంత్రించాలి. ట్రాన్స్‌పోర్టు చార్జీల ప్రభావం కూరల ధరలపై పడిందని వ్యాపారులు చెబుతున్నారు.

– నాగేశ్వరరావు, ఉద్యోగి, తుని.

వర్షాలతో తగ్గిన దిగుబడులు

వర్షాలు ఎక్కువ కురవడంతో స్థానికంగా పంట దిగుబడులు తగ్గడం వలన ధరలు పెరిగాయి. దీంతో పాటు విజయవాడ, రాజమహేంద్రవరం లంక భూముల్లో కూరగాయల పంటలు వరదకు గురయ్యాయి. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా దిగుబడులు లేక పోవడంతో హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన దానికి చిల్లరగా అమ్మకం చేసినా గిట్టుబాటు కావడం లేదు. గతంలో కిలో కొనుగోలు చేసిన వినియోగదారులు అర కిలో కొంటున్నారు. ధరల ప్రభావంతో వ్యాపారం చేయడం కష్టంగా ఉంది.

– సుధాకర్, కూరగాయల వ్యాపారి, తుని

ధాన్యం కొలుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు నచ్చిన చోట విక్రయాలు చేయొచ్చు
- జేసీ రాహుల్ మీనా



మురారిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ

గండేపల్లి: రైతులకు అనుకూలంగా ధరలు ఉన్నచోట ధాన్యాన్ని విక్రయించు కోవచ్చునని జేసీ, అడిషనల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ రాహుల్ మీనా అన్నారు. మండలంలోని మురారిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు జిల్లాలో తొలిసారిగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకూడదని ఎటువంటి మోసాలకు తావు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. కనీస మద్దతు ధరకు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చునని తెలియజేశారు. ఇప్పటికే రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్లు తుమ్మల పద్మజ లక్ష్మి, కదలి ఈశ్వరి, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



చేపూరు గ్రామసభలో వినతి పత్రాలు అందజేస్తున్న రైతులు



బురదకోటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ కల్యాణి



పైడికొండ గ్రామ సభలో వినతులను స్వీకరిస్తున్న తహసీల్దార్ మురార్జి

తుని రూరల్: రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మంగళవారం తుని మండలం చేపూరులో సర్పంచ్ కొండ్రు నాగేశ్వరరావు అధ్యక్షతన రీ సర్వే సమస్యలు–పరిష్కారాలపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో ఇప్పటికే రీ సర్వే పూర్తయిందని, ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే తగిన ఆధారాలతో పరిష్కరించుకోవాలన్నారు. రైతుల నుంచి వినతి పత్రాలను మండల సర్వేయర్ దేవుడు స్వీకరించారు. స్థానిక నాయకులు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభకు 32 అర్జీలు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం సచివాలయం వద్ద నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో 32 అర్జీలు అందాయని డీటీ నరేష్‌కుమార్ తెలిపారు. గతంలో రైతులకు సంబంధించిన భూమి కొలతలు, సరిహద్దులు తదితర అంశాలలో దొర్లిన తప్పులపై భూముల రీ సర్వే చేపట్టడం జరిగిందన్నారు. ఈ సర్వేకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరణకు ఈ గ్రామసభను నిర్వహించడం జరిగిందన్నారు. రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దినేష్ పట్నాయక్, వీఆర్ చంటి, సర్వేయర్ చంటి, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభకు 18 అర్జీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బుదరకోట గ్రామంలో ల్యాండ్ రీ సర్వే గ్రామ సభను మంగళవారం రెవెన్యూ అధికారులు నిర్వహించారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ గ్రామ సభలకు సంబంధించి తొలిరోజు భూ సంబంధిత సమస్యలపై 18 వినతులు వచ్చాయి. డిప్యూటీ తహసీల్దార్ ఎంపీఎల్ కల్యాణి గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. సమావేశంలో చింతల చిన్నాలమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు చింతల రాజు, మాజీ సర్పంచ్ నిమ్మల అప్పారావు, వీఆర్వో భాస్కర రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభకు 158 వినతులు

తొండంగి: భూముల రీ సర్వేకు సంబంధించి రెవెన్యూ శాఖ పైడికొండలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో రైతుల నుంచి 158 వినతులు వచ్చాయని తహసీల్దార్ వి.మురార్జీ తెలిపారు. గ్రామంలోని నిర్వహించిన సభలో రీ సర్వేలో భూముల విస్తీర్ణం, సరిహద్దులు వంటి వివరాల్లో మార్పులు చేయాలంటూ రైతుల నుంచి వినతులు అందాయన్నారు. వచ్చిన వినతులను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా రికార్డుల ప్రకారం కచ్చితమైన వివరాల నమోదుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు అనుసరించాల్సిన విధి విధానాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వివరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావులు పట్టభద్రులను గుర్తించడం, ఓటు నమోదు చేయించడం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు డీవీవీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మీసాల రాజు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల ర్యాలీ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు బంగారాజు

ఏలేశ్వరం: ఎన్డీఏ, బీజేపీ మత రాజకీయాలకు వ్యతిరేకంగా డిశంబర్ 4న విజయవాడలో నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు కోరారు. స్థానిక ఎస్ కన్వెన్షన్ హాలులో మంగళవారం లిబరేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. బంగార్రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిర్వహిస్తున్న ప్రజా హక్కుల ర్యాలీకి ప్రజలంతా మద్దతు ప్రకటించాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు ప్రజలపై కపట ప్రేమ ప్రదర్శించిందన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేస్తామని చెప్పి ఒక్క ఫించన్లకే పరిమితమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యం కప్పిపుచ్చుకొనేందుకు చంద్రబాబు పవన్‌కల్యాణ్‌తో కలిసి సనాతన ధర్మం, లడ్డూ వివాదాలను తెర మీదకు తీసుకువచ్చి ప్రజల్లో గందరగోళం సృష్టించారన్నారు. మత రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. పిఠాపురంలో అత్యాచారం జరిగితే డిప్యూటీ సీఎం పట్టించుకోలేదని తమ పార్టీయే పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైతులకు రాబడి పెంచడమే లక్ష్యం



శంఖవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది



తొండంగిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ బుల్లిబాబు



సీతారాంపురం వ్యవసాయ క్షేత్రంలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ మాధవి

శంఖవరం: రైతులకు రాబడి పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు బీవీఎస్ హరి రైతులకు తెలిపారు. మండలంలోని నెల్లిపూడిలో వ్యవసాయాధికారి గాంధీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు అనుబంధ శాఖల ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు గ్రాస పెంపకం, పశువులకు ఆశించే వ్యాధులు, టీకాలపై పాడిరైతులకు పశు సంవర్ధక అధికారి డా.ప్రసాద్ వివరించారు. ఉద్యాన పంటల సాగు, జాగ్రత్తల గూర్చి ఉద్యాన అధికారి అరుణ్ కుమార్ వివరించారు. అనంతరం రైతులతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించి చీడపీడల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ, సెరికల్చర్ సిబ్బంది శ్రావణి, చిన్న బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మురళి, వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: వరి సాగులో ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం కీలకమని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. ఎస్సార్ పేట, బిళ్లనందూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది గ్రామసభలు నిర్వహించారు. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఎరువులు, పురుగు మందులు, నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీహెచ్ఏ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి

తొండంగి: ఖరీఫ్‌లో వరి పైరులో పొట్ట, ఈనుక దశలో వచ్చే తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని కాకినాడ డీఆర్సీ ఏడీఏ మాధవి అన్నారు. మంగళవారం తొండంగి మండలం సీతారాంపురంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రంలో వరిలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణా చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బెంగాల్ నాట్ల విధానంతో అధిక దిగుబడులు

తుని రూరల్: బెంగాల్ వరినాట్ల విధానంతో అధిక దిగుబడులు లభిస్తున్నాయని, మెట్ట ప్రాంతంలో సైతం ఈ విధానాన్నే అవలంబిస్తే ఖరీఫ్, రబీల్లో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు అన్నారు. మంగళవారం తుని మండలం వల్లూరు గ్రామంలో ఏఓ బి.అశోక్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బుల్లిబాబు మాట్లాడుతూ బెంగాల్ నాట్ల విధానంతో వరిలో ఎక్కువ దుబ్బులు మొలకెత్తి, పైరుకు విశాలంగా గాలి, వెలుతురు లభిస్తుందన్నారు. దీనివల్ల తెగుళ్ల అదుపులో ఉండడంతో పాటు దిగుబడులు పెరుగుతున్నట్టు చెప్పారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఎంటీయూ 1262 వరి విత్తనాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, వినియోగానికి అనువుగా ఉన్నాయని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మాధవి అన్నారు. మార్కెట్ అవసరాలకు అనువుగా కూరగాయలను రైతులు పండించాలని, ఇందుకు రాయితీలు ఇస్తున్నట్టు ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి సూచించారు. మాజీ వైస్ ఎంపీపీ కుర్ర బాబ్జి, మాజీ సర్పంచ్ కుర్ర వెంకటరమణ, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ నిలుపు చేయాలని ఆందోళన



గుమ్మళ్లదొడ్డి ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీకీ వ్యతిరేకంగా మంగళవారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామంలో ప్రధాన రహదారిపై గ్రామస్తులు బైఠాయించి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్య వ్యర్థాల వలన అనారోగ్యం పాలవుతున్నామని తక్షణమే ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. సుమారు గంట పాటు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్‌లు అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఇదిలా ఉండగా ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, మరో నాయకుడు పాతంశెట్టి సూర్యచంద్రలు గ్రామంలోని రామాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. సమస్య పరిష్కరించే వరకు దీక్ష విరమించబోమని వారు తెలిపారు. దీక్షా శిబిరాన్ని జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం అస్సాగో ఫ్యాక్టరీని సందర్శించి యాజమాన్యంతో మాట్లాడారు.

బైకును ఢీకొట్టిన వ్యాన్: ముగ్గురికి గాయాలు



క్షతగాత్రునికి సపర్యలు చేస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

జగ్గంపేట: మండలంలోని రామవరం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వివరాల మేరకు విశాఖ నుంచి విజయవాడ వైపు వెళుతున్న మినీ వ్యాన్ గ్రామ శివారులోకి వచ్చేసరికి ముందు వెళుతున్న మోటార్ సైకిల్‌ను అధిగమించే ప్రయత్నంలో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో దానిపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు కింద పడిపోయారు. ఈ సంఘటనలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కబడ్డీ జట్టు ఎంపిక

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయంలో 2024 ఏడాదికి సంబంధించి కబడ్డీ టీంను ఎంపిక చేసినట్టు డిప్యూటీ ఛాన్సలర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదిత్య యూనివర్సిటీ టీంకు ఎంపికైన క్రీడాకారులకు యూనివర్సిటీ యాజమాన్యం అభినందనలు తెలిపింది. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ రమశ్రీ, ప్రొఫెసర్ వి సత్యనారాయణ పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆరుగుల మోషే

కోటనందూరు: దళితుల డీ పట్టా భూములను అన్యాయంగా లాక్కొని, క్రియా దస్తావేజులు రాయించుకుంటున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శుభాష్‌కు ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అమాయకులైన దళితులను కొంతమంది మోసం చేసి వారి నుంచి డీ పట్టా భూములు రాయించుకుంటున్నారని తహసీల్దార్‌కు వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో శిక్ష ఖరారు

గండేపల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 4 గురికి జైలు, 5 గురికి జరిమాన విధించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చేపట్టిన తనిఖీల్లో గండేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 8, జగ్గంపేట పరిధిలో ఒక కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరిని పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ జి కృష్ణ శేషచార్య ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున జరిమాన, మరో నలుగురు వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. జగ్గంపేటలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఇద్దరికి రూ.600 చొప్పున జరిమాన విధించినట్టు చెప్పారు.

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

జగ్గంపేట: స్థానిక రావులమ్మనగర్‌లో ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పట్ట భద్రుల ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరాజు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణవర్మ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు వెండి కిరీటం బహూకరణ

కిర్లంపూడి: జగపతినగరం గ్రామ శివారులో కొలువైన శ్రావణి దుర్గమ్మ అమ్మ వారికి వెండి కిరీటం బహూకరించారు. అనకాపల్లికి చెందిన పిల్లా కొండబాబు, పిల్లా సురేష్ దంపతులు సుమారు రూ. 20 వేలతో తయారు చేసిన వెండి కిరీటం, మంగళ సూత్రాలను మంగళవారం ఆలయ వ్యవస్థాపకులు చిట్టిబోయిన సూర్యనారాయణకు అందజేశారు.

GENERAL PUBLICATION

Under instructions from our client M/S. Shriram Finance Limited, Registered Office at Chennai and Branch Office at TUNI I issue this notice to the General Public.

Our client is intending to advance loan to Pasumarthi Smt. Suryakala w/o Rajesh of Tuni Tuni mandal Kakinada district of agreed to create equitable mortgage relating to the under mentioned schedule property belongs to them. The public is hereby informed that if anybody has got any objection in respect of the mortgage of the schedule property, kindly contact under mentioned address within one week. Otherwise, the same is treated as no objection.

Schedule of the Property

Previously East Godavari district,Present Kakinada District, Tuni Mandal, Tuni Sub- Registry, Tuni Municipality having S.no.268/1 for an extent of 36 sq.yards or 30.34 sq.meters house and site with assessment no.8477 having D.no.6-17-14 within the following boundaries and measurements

East : House wall of Kotta Peda Nookayya Setti; South :47 sq.yards of Talluri Malleswararao's property; West : Municipal road; North Joint way of donor

The above bounded an extent of 36 sq.yards or 30.34 sq.meters of site with easement rights etc.

Place: Peddapuram T.SATYANARAYANA, B.Com., B.L.
Date: 21.10.2024. ADVOCATE, PEDDAPURAM. 9885857091